క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే



మాట్లాడుతున్న సాంబారి ప్రభాకర్

మల్లాపూర్: బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు 2023లో బీజేపీకే పట్టం కడతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి అన్నివర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బీజేపీ క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పునఃరుద్ధరణ



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామం నుంచి గోదావరి తీరంతో పాటు, రేకులపల్లి ఎత్తిపోతల పథకానికి వెళ్లే 2 కిలోమీటర్ల రోడ్డు పనులను శుక్రవారం 10 గంటల పాటు శ్రమించి పునఃరుద్ధరించారు. గ్రామపంచాయతీలో నిధుల కొరత ఉన్నప్పటికీ సర్పంచ్ ఎలగందుల లక్ష్మి పనులు పూర్తి చేయించడంతో తమ సమస్య తీరిందని రైతులు సంతోషిస్తున్నారు. వర్షాకాలంలో రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడం, గోదావరి ఉప్పొంగి గ్రామం నుంచి గోదావరికి వెళ్లే కంకర రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ రోడ్డు గుండా రైతులు తమ పంట పొలాలకు, గోదావరి తీరం ఆనుకుని ఉన్న గంగమ్మ తల్లి ఆలయానికి, గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లడానికి అటు గ్రామస్తులు, ఇటు రైతులు ఆరునెలల నుంచి తిప్పలు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతు జరపాలని సర్పంచ్‌కు విన్నవించారు. స్పందించిన సర్పంచ్ దాదాపు 10 ట్రాక్టర్లు, రెండు బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీతో రెండు కిలోమీటర్ల రోడ్డును పూర్తిగా పునఃరుద్ధరించారు.

తీగలకుంట చెరువు పరిశీలన

కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామశివారులో గల తీగలకుంట చెరువును కథలాపూర్ ఎస్సై రామచంద్రం, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి ఎస్సై రమేశ్ శుక్రవారం పరిశీలించారు. తీగలకుంట చెరువులో చేపలు పట్టుకోవడంపై తుర్తి, చందుర్తి మండలం కొత్తపేట గ్రామాల మత్స్యకారుల మధ్య వివాదం నెలకొంది. తీగలకుంట తుర్తి రెవెన్యూ పరిధిలో ఉండటంతో చేపలను ఏళ్లుగా తామే పట్టుకొని ఉపాధి పొందుతున్నామని తుర్తి మత్స్యకారులు పేర్కొంటుండగా.. తాము కూడా చేపలను పట్టుకున్నామని కొత్తపేట మత్స్యకారులు అంటున్నారు. దీంతో రెండు మండలాల ఎస్సైలు శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మత్స్యశాఖ అధికారులు వచ్చి సర్వే చేసే వరకు రెండు గ్రామాల మత్స్యకారులు తీగలకుంటలో చేపలు పట్టవద్దని ఎస్సైలు సూచించారు.

నూతన పరీక్షా విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు ఉన్నత పాఠశాలలో నూతన పరీక్షా విధానంపై ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 9, 10వ తరగతి విద్యార్థులకు నూతన పరీక్షా విధానం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా సబ్జెక్టుల వారీగా బ్లూ ప్రింట్‌పై చర్చించి విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల

ఇబ్రహీంపట్నం: పిల్లల ఎదుగుదలకు తల్లులు పౌష్టికాహారం తినిపించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గోధూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్ల లకు అన్నప్రాసన చేశారు. ఉపసర్పంచు నల్ల తిరుపతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరి పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ఊసేలేని సేంద్రియ ఎరువుల తయారీ
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- నిర్వహణ లోపం కారణంగా.. అలంకారప్రాయంగా కేంద్రాలు

వెల్గటూర్: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ బాగుండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. ఒక్కో సెగ్రిగేషన్ షెడ్‌కు రూ.2.50లక్షల ఖర్చుతో వీటి నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి పంచాయితీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి ఆ తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని అధికారులను ఆదేశించింది. నూతనంగా ఏర్పాటైన ఎండపల్లి మండలంతో కలిపి ఉమ్మడి వెల్గ టూర్ మండలంలో ఉన్న 30 గ్రామాల్లో ఈ సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. కానీ వీటి నిర్వహణను గాలికి వదిలేశారు.



పిచ్చి మొక్కలతో నిండి ఉన్న సెగ్రిగేషన్ షెడ్

ఎరువుల తయారీ ద్వారా ఆదాయం..

ఉమ్మడి మండలంలో కేవలం 3 నుంచి 4 గ్రామాల్లో మాత్రమే సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటుండగా, మిగతా పంచాయతీల్లో వీటి నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది కొరత, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులు తయారు చేసి విక్రయించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ యూనిట్లకు పంపించడం ద్వారా పంచాయితీలకు ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావించి రూ.లక్షలు వెచ్చించి వీటిని నిర్మించారు. కానీ ఎక్కడా కూడా ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టు వీటి నిర్వహణ లేదు.

అవగాహన లోపం కారణంగా..

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో డంపింగ్ యార్డుతో పాటు సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. దీంతో పాటు చెత్త తరలించడానికి ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్లను సైతం కొనుగోలు చేసింది. ప్రతీ ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా వేసుకునేందుకు ఇంటింటికీ చెత్త బుట్టలను పంపిణీ చేసింది.



నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్

పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ కంపోస్టు షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరల్లో వాటిని పోసి సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉండగా పారిశుధ్య సిబ్బంది అవగాహనా లోపంతో ఒకే ట్రాక్టర్‌లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల్లో పోస్తున్నారు. ప్రజల్లో కూడా తడి, పొడి చెత్త వేరు చేయడంలో అధికారులు సరైన అవగాహన కల్పించడం లేదు.

అలంకార ప్రాయంగానే..

ఉమ్మడి వెల్గటూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీల పరిధిలో వీటిని నిర్మించారు. తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చేందుకు ప్రభుత్వం వానపాములను కూడా సమకూర్చుతుంది. అయితే సుమారు 3 నుంచి 4 పంచాయతీల్లోనే ఈ ప్రక్రియ నామమాత్రంగా సాగుతోంది. సర్పంచులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు చెల్లించిన పన్నులతో నిర్మించిన ఈ కేంద్రాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం



కొన్ని గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారీ కొనసాగుతోంది. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా కొన్ని గ్రామాల్లో వానపాములు చనిపోయి ఎరువుల తయారీ ఆగిపోయింది. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్తను వేరుచేయకుండా చెత్త బండిలో వేయడంతో కొంత సమస్య ఏర్పడుతోంది. అధికారులందరికీ ఆదేశాలు జారీచేశాం. నాలుగైదు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.

– సంజీవరావు, ఎంపీడీవో, వెల్గటూర్

దేశానికే ఆదర్శంగా రాష్ట్ర సంక్షేమ పథకాలు

కొడిమ్యాల: అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు ఎంపీపీ మేనేని స్వర్ణలత అధ్యక్షతన శుక్రవారం కొడిమ్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల సీఎంలు, నాయకులు రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను అభినందిస్తుండగా రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీల నాయకులు రాజకీయ కారణాలతో విమర్శలు చేస్తున్నారన్నారు. నాలుగేళ్ల తన పదవీకాలంలో కొడిమ్యాల మండలంలో సుమారు రూ.100కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టానని పేర్కొన్నారు. మండలంలోని పోతారం రిజర్వాయర్ మిగులు పనులను పూర్తి చేసేందుకు త్వరలోనే టెండర్లు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం కొడిమ్యాల–నాచుపల్లి గ్రామాల మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, ఎంపీడీవో పద్మజ రాణి, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. గ్రామంలో నిర్మించిన అదనపు వైకుంఠధామాన్ని ప్రారంభించారు. ముత్యంపేటలో రూ.15లక్షల విలువైన సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. అనంతరం రాంపూర్‌లోని మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలలో రూ.12లక్షల విలువైన పనులు, రూ.40లక్షల విలువైన సీసీరోడ్లు, రెడ్డి సంఘ భవనం పనులకు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, రాంపూర్ సర్పంచ్ బి.తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఎంపీటీసీ సామల రేణుక, క్యాతం పద్మభూపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సాగర్‌రావు, మధుసూదన్‌రావు, రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాల సందర్శన

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆర్డీవో వినోద్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. సర్పంచ్ దుంపాల నర్సు, వైద్యాధికారి రమ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్తర్ పాల్గొన్నారు.

పెగడపల్లి మండలంలో..

పెగడపలి: మండలంలోని నందగిరి, దోమలకుంట గ్రామాల్లోని కంటివెలుగు శిబిరాలను ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్ శుక్రవారం పరిశీలించారు. వైద్యాధికారి నరేశ్ పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

మేడిపెల్లి: కంటి చూపు సమస్యలు ఉన్న వారు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గుండ్లపెల్లిలో కంటివెలుగు కేంద్రాన్ని సందర్శించారు. వైద్యబృందం, ఆశవర్కర్లను సన్మానించారు. సర్పంచ్ సంపత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఎంపీవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ చంద్ర, అభిలాష్, అంకం సాగర్, మకిలిదాస్ పాల్గొన్నారు.



కోరుట్లరూరల్: కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో

క్యాంపు సందర్శన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫకీర్‌కొండాపూర్ గ్రామంలో రెండో విడత 2వ రోజు శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ సందర్శించారు. వైద్యాధికారి రాజేందర్, హెచ్‌ఈ వెంకటేశం పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు

జగిత్యాల: ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బోనగిరి నరేశ్‌ను శుక్రవారం తెలంగాణ నాన్‌గెజిటెడ్ వెటర్నరియన్స్ జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్

వెల్గటూర్: పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ కోరారు. ఈ మేరకు వెల్గటూర్ మండలం రాజక్కపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యశిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, శ్వాసకోశ వ్యాధులు మొదలైన సమస్యలకు చికిత్స చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ పాడేటి రవి, సర్పంచ్ బోడకుంటి రమేశ్, పశు వైద్యాధికారి శ్రీప్రియ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ దహన సంస్కారాలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో శుక్రవారం వేల్పుల గంగమల్లమ్మ(60) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌తో పాటు వార్డుసభ్యులు జహిందర్, నాయకులు బిట్ల నరేశ్, గుగ్లావత్ రాజేందర్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామపంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ప్రకారం గ్రామంలో ఎవరు మృతి చెందినా.. దహన సంస్కరాలకు రూ.10వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బుగ్గారం: మండలంలోని సిరికొండ 33/11 కేవీ సబ్‌స్టేషన్ దగ్గరలో ఫీడర్ షిఫ్టింగ్ పనులతో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ బండారి అశోక్ తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని సిరికొండ, బిర్సానీ, మద్దునూర్, గోపులాపూర్, వేనుగుమట్ల, లొత్తునూర్, బొంకూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

✦ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.22 లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామంలో పశువైద్యశాలకు రూ.10లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.12లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

✦ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాలరూరల్: జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో గ్రామాలను తొలగిస్తూ శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం చేయించడంపై శుక్రవారం సాయంత్రం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ వద్ద రైతులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు క్షీరాభిషేకం చేశారు. ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

✦ నూతన కార్యవర్గం ఎన్నిక

మల్యాల: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ నర్సయ్య నియమించారు. మండలాధ్యక్షుడిగా కేసరి గణేశ్, ప్రధాన కార్యదర్శిగా మెడబోయిన వెంకటేశ్, సలహాదారుగా సీలం రామును నియమించారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరికెల లక్ష్మి మాట్లాడుతు ప్రతి సంవత్సరం ఆరునెలలకు ఒకసారి ఖరీఫ్, రబీ సీజన్ ఆరంభాలలో ఇంటికి ఒక సభ్యుడి చొప్పున మొగిలిపేటశివారులోని గోదావరి నది తీరానికి కాలినడకన వెళ్లి పుణ్యస్నానం ఆచరించి మడి బట్టలతోనే బిందెలతో నీళ్లు తీసుకొచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, కార్యదర్శి మురళి, సీనియర్ నాయకులు సరికెల మహిపాల్ పాల్గొన్నారు.



నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

అటెన్షన్ ప్లీజ్



వరదకాలువ నీళ్లు ఎత్తిపోతలు ఎప్పుడో?

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్తున్న ఎస్సారెస్పీ వరదకాలువ నీటిని ఎత్తిపోతలతో అన్ని గ్రామాల చెరువులను నింపేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. నిధుల మంజూరు గురించి రోజుకో విధంగా ప్రజాప్రతినిధులు ప్రకటిస్తున్నారు. కానీ నిధులు మాత్రం మంజూరు కావడంలేదని మండల రైతులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వరదకాలువ నీళ్లు ఎత్తిపోసే పనులను త్వరగా ప్రారంభించాలని మండల రైతులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : వంశీ, వరదకాలువ ఎత్తిపోతల విభాగం, వేములవాడ సబ్ డివిజన్, ఫోన్ నంబర్ 88975 28309

కరెంట్ బిల్లులో ఏసీడీ పన్ను ఎత్తివేయాలి

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఏసీడీ కరెంట్ బిల్లులకు వ్యతిరేకంగా శుక్రవారం సుమారు రెండుగంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కుంట రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కరెంట్ బిల్లుల్లో ఏసీడీ పేరుతో పన్ను విధించడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఏసీడీ పన్ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సుమారు రెండుగంటలు ధర్నా చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మహిపతిరెడ్డి, నాయకులు అంజి, ఊట్నూరు నరేశ్, గడ్డం సంజీవ్‌రెడ్డి, కొక్కెర రాజు, రొట్టె శ్రీధర్, జీవన్‌రెడ్డి, జలేందర్, విజయ్, సామల్ల మహేశ్, సతీశ్, గంగారెడ్డి, ప్రభాకర్, ధనుంజయ్, మహేందర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మల్లాపూర్: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మొగిలిపేటలో ఆయన పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కుట్రపూరితంగా ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని, కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామగ్రామాన గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రజలు, కార్యకర్తల మధ్యనే ఉంటూ వారి సేవకే పూర్తి సమయం వినియోగిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన తిరిగి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కల్లెడ గంగాధర్, నాయకులు ఎనడ్ల రాములు, తిప్పని సాయి, జెల్లా ప్రసాద్, వరద సురేశ్, రాజేందర్, ఎదులాపురం రాజరెడ్డి, మాసుల చిన్నయ్య, సల్మాన్, మోకు రమేశ్, ఇప్పపెల్లి గణేశ్, మొగిలి రాజేందర్, బైండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్వకుంట్ల సుజిత్‌రావు

రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

పెగడపల్లి: రబీలో సాగైన వరిపైర్లపై కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని, వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని డీఏవో సురేశ్ రైతులకు సూచించారు. మండలంలోని లింగాపూర్‌లోని పలువురి రైతులకు చెందిన వరిపైర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా పైరుపై మొగిపురుగు ఆశించి పైరును నష్టపరుస్తోందన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈవోలు నవీద్, సరోజినీ, అశోక్, మల్లేశం ఉన్నారు.



పెగడపల్లి: వరిని పరిశీలిస్తున్న డీఏవో సురేశ్

చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: యాసంగిలో వరిపైర్లకు పిలక దశలోనే మొగిపురుగు సోకుతుందని, రైతులు గమనించి చర్యలు తీసుకోవాలని ఏవో దీపిక సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అమ్మక్కపేటలో వరిపైర్లను పరిశీలించారు. వరికి మొగిపురుగు సోకినప్పుడు రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి ఏవో వివరించారు. ఏఈవో నరేశ్, హరీశ్, రైతులు పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామంలో వరిపొలాలను మండల వ్యవసాయ అధికారి నాగమణి శుక్రవారం పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ దుంపాల నర్సు, ఏఈవో పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై దృష్టిపెట్టాలి

సారంగాపూర్: రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకంపై దృష్టిపెట్టాలని ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో ధర్మపురి మార్కెట్ కమిటీ, పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, కోళ్లకు పరీక్షలు నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి సునీల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నారపాక రమ, పశువైద్యాధికారి సునీల్, మార్కెట్ కమిటీ కార్యదర్శి వరలక్ష్మి, బీర్‌పూర్ రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మేరుగు రాజేశం పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న కమిటీ చైర్మన్